సాక్షి
జగిత్యాల
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



అభివృద్ధి పనుల పరిశీలన

మేడిపెల్లి: అదనపు కలెక్టర్ మకరంద్ మండల కేంద్రంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు శుక్రవారం పరిశీలించారు.



రాజన్న జలప్రసాదం

వేములవాడ: భక్తులకు స్వచ్ఛమైన జలం అందించేందుకు రాజన్న జలప్రసాదం పేరుతో ఆరుచోట్ల ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.0/16.0

గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. సాయంత్రం చలి పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైభవంగా క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసాచార్యుల మంత్రోచ్చారణలతో లక్ష్మీహవన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ కలహాలు, భూ, ఆర్థిక సమస్యలు, కోర్టు వివాదాలు తొలగిపోయేందుకు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని అర్చకులు సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న దావ వసంత

జగిత్యాలజోన్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మన ఊరు–మన బడి ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ, పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం మన ఊరు–మన బడి చేపట్టిందన్నారు. తాగునీరు, ఫర్నీచర్, మూత్రశాలల నిర్మాణం, డిజిటలైజేషన్ వంటివి కల్పించి మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని కోరారు. పనులన్నింటినీ మే 15వ తేదీ వరకు పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామానుజాచారి, డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

జగిత్యాలరూరల్: ఉద్యోగులకు పేస్కేలు వర్తింపజేస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కోరారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. నగదు రహిత వైద్య సేవలు, హెల్త్‌కార్డు సదుపాయం కల్పించాలన్నారు. దివ్యాంగ ఉద్యోగులకు అలవెన్స్‌లు చెల్లించాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. నాయకులు బర్ల నారాయణ, కుడుకల రవీందర్, చిట్యాల రవి, బొడ్డు సురేశ్, హన్మండ్ల శ్రీనివాస్, రాజేందర్, ఫరూక్, కృష్ణప్రసాద్, ప్రతాపచారి, మల్లేశం, శ్రీకాంత్, తిరుపతి పాల్గొన్నారు.

76వేల మందికి 'కంటి వెలుగు' పరీక్షలు



శిబిరంలో జయపాల్‌రెడ్డి తనిఖీలు

సారంగాపూర్(జగిత్యాల): జిల్లాలో చేపట్టిన రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఇప్పటిదాకా 76,086 మందికి కంటి పరీక్షలు చేసినట్లు మాతా, శిశు సంరక్షణాధికారి జయపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. 12,016 మందికి కళ్లద్దాలు అందజేశామని, మరో 13,491 మందికి దూరపుచూపు అద్దాలు అవసరమైనట్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలోని 66 గ్రామ పంచాయతీలు, 30 వార్డుల్లో కంటి పరీక్షలు పూర్తి చేసినట్లు వివరించారు. మండల వైద్యాధికారి మైత్రీరాణిరెడ్డి, కంటి వెలుగు కార్యక్రమం వైద్యాధికారి అంజలి, సూపర్‌వైజర్ సులోచన, నిర్వాహకుడు సోహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు మింగుతున్న కాలువలు!

- ఎస్సారెస్పీ కెనాల్స్ వెంట రహదారులు
- రెండింటి మధ్య దూరం కేవలం రెండు మీటర్లే..
- శిథిలమైన వంతెనలతోనూ ప్రమాదాలు
- జిల్లాలో ఎక్కడా కానరాని రక్షణ చర్యలు
- అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్తున్న వాహనాలు
- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- మేడిపల్లి, ఇబ్రహీంపట్నం శివార్లలో పరిస్థితి మరింత భయంకరం

జగిత్యాలక్రైం: జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామం వద్ద ప్రారంభమయ్యే ఎస్సారెస్పీ ప్రధాన కాలువ.. పెగడపల్లి మండలం నామాపూర్ శివారు వరకూ విస్తరించి ఉంది. సుమారు 60 కి.మీ. పొడవున ప్రవహించే కెనాల్‌కు పలు ఉపకాలువలూ ఉన్నాయి. వీటివెంట వివిధ ప్రాంతాల్లో సుమారు 400 కి.మీ. మేర రోడ్లు నిర్మించారు. కాలువలు, రోడ్లకు మధ్య దూరం దాదాపు రెండు మీటర్ల వరకే ఉండడంతో వాహనాలు అదుపుతప్పితే నేరుగా కాలువల్లోకి దూసుకెళ్తున్నాయి. ప్రధాన కాలువ సుమారు 12 మీటర్ల లోతు ఉంటుంది. అందులో ఎవరు జారిపడ్డా ప్రాణాలపై ఆశలు వదులు కోవాల్సిందే. ఉపకాలువల పరిస్థితి కూడా ప్రమాదకరంగానే ఉంది.


తేదీ :	ఆదివారం రాత్రి(ఈనెల 5)
ప్రాంతం :	జగిత్యాల ధరూర్ సమీప ఎస్సారెస్పీ ఉపకాలువ
ప్రమాదం :	కారు అదుపుతప్పి కాలువలో పడిపోయింది
పర్యవసానం :	రిజ్వాన్(35) చనిపోయాగా, అతడి మిత్రులు నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

తేదీ :	15 ఫిబ్రవరి 2021
ప్రాంతం :	కోరుట్ల మండలం మేడిపల్లి శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువ
ప్రమాదం :	కారు అదుపుతప్పి కెనాల్‌లోకి దూసుకెళ్లి నీట మునిగింది
పర్యవసానం :	జగిత్యాలకు చెందిన ప్రముఖ న్యాయవాది కట్కేనేని అమరేందర్‌రావు, భార్య శిరీష, కూతురు శ్రేయ మృతిచెందారు. కుమారుడు జయంత్ ప్రాణాలతో బయటపడ్డాడు.

సాక్షి ఫొటోస్



అంబారిపేట ఎస్సారెస్పీ కాలువపై రెయిలింగ్ శిథిలమై ప్రమాదకరంగా ఉన్న వంతెన



తాటిపల్లి వద్ద ప్రమాదకరంగా జగిత్యాల-నిజామాబాద్ జాతీయ రహదారి

వెంటాడుతున్న వ్యవసాయ బావులు..

జిల్లాలో ఎస్సారెస్పీ కాలువలు విస్తరించిన ప్రధాన రహదారుల వెంట వ్యవసాయ బావులు కూడా అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ఒకవైపు కాలువలు, మరోవైపు వ్యవసాయ బావులు ఉండటంతో వాహనాలు నడపడం సాహసంతో కూడుకుంటోంది. జగిత్యాల అర్బన్ మండలం మోతె, ధరూర్, జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ శివారుల్లో వ్యవసాయ బావులు రోడ్ల వెంట ప్రమాదకరంగా ఉన్నాయి. మేడిపల్లి–రాయికల్, మల్యాల– కొడిమ్యాల, పెగడపల్లి – గొల్లపల్లి, వెల్గటూర్– ధర్మపురి, బీర్‌పూర్ –సారంగాపూర్, ఇబ్రహీంపట్నం – మల్లాపూర్, మేడిపల్లి – కోరుట్ల – కథలాపూర్ మండలాల్లోనూ మెయిన్ రోడ్ల వెంటే వ్యవసాయ బావులు ఉన్నాయి. కొన్నిచోట్ల రైతులు ఇనుప కంచెలు ఏర్పాటు చేసుకోగా మరికొన్నిచోట్ల ఎలాంటి రక్షణ చర్యలు లేవు.

రెయిలింగ్‌లు నిర్మిస్తున్నాం

జిల్లాలోని ఎస్సారెస్పీ కాలువల వెంట ఉన్న ఆర్ అండ్ బీ రోడ్ల పక్కన రెయిలింగ్ నిర్మిస్తున్నాం. ప్రమాదకరమైన ప్రాంతాల్లో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రధానంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్, ఈఈ, ఆర్ అండ్ బీ

భయం భయంగా ప్రయాణం

- జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువపై వంతెన శిథిలావస్థకు చేరింది. వాహనాల రాకపోలు భయంకరంగా ఉంటున్నాయి.
- జగిత్యాల అర్బన్ మండలం మోతె శివారు బైపాస్ రోడ్డు సమీపంలోనే ఓ వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది.
- గ్రానైట్ లోడ్‌తో వెళ్లే లారీలు, బస్సులు, భారీ వాహనాలను తప్పించే క్రమంలో అదుపు తప్పి వావహనాలు నేరుగా కాలువల్లోకి దూసుకెళ్తూ తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట వద్ద రెయిలింగ్ కూలిపోయింది. వంతెన శిథిలమైంది. ప్రమాదకరంగా మారింది.
- జగిత్యాల – నిజామాబాద్ జాతీయ రహదారిపై తాటిపల్లి ఎస్సారెస్పీ ప్రధాన కాలువపై వంతెన ఇరువైపులా రేలింగ్‌లు కూలాయి. వంతెన శిథిలావస్థకు చేరింది. అధికారులు తాత్కాలిక గోడ నిర్మించినా చిన్నవాహనం ఢీకొడితే అది కూలిపోతుంది.
- ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలు, వంతెనలు అత్యంత ప్రమాదకరంగా మారాయి.
- కోరుట్ల – సిరికొండ, మేడిపల్లి సమీపంలోని కాలువలు, వంతెనల పరిస్థితి కూడా దాదాపు ఇలాగే ఉంది.
- దాదాపు 50ఏళ్ల కితం ఎస్సారెస్పీ కాలువ నిర్మాణ సమయంలోనే వంతెనలు నిర్మించారు. ఇప్పుడవి శిథిలమయ్యాయి.
- వాటివెంట రహదారులు నిర్మించినా రక్షణ చర్యలు చేపట్టలేదు.
- ఫలితంగా వంతెనలు, కాలువల వెంట తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

కన్నుల పండువగా నృసింహుని రథోత్సవం



రథోత్సవంలో భక్తజనం



జాతరకు తరలివచ్చిన భక్తులు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. బీర్‌పూర్, సారంగాపూర్, ధర్మపురి, జగిత్యాల, రాయికల్ తదితర మండలాలతో పాటు మంచిర్యాల జిల్లా జన్నారం మండలం నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కొండపై ఆశీనులైన స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఆశీనులను చేసి మంగళవాయిద్యాలతో కొండ దిగువన జాతర స్థలికి తీసుకొచ్చారు. అర్చకులు హోమం కాల్చారు. స్వామివారిని రథంపై దర్శించుకున్న భక్తులు.. పూలు, కానుకలు సమర్పించుకునేందుకు పోటీపడ్డారు. దీంతో రథోత్సవం ప్రారంభించేందుకు చాలా సమయం తీసుకుంది. ప్రారంభ కార్యక్రమం ఆలస్యం కావడం, చీకటి పడుతుందనే ఆలోచనతో అధికారులు హడావుడి చేశారు. దీంతో భక్తులు ఒక్క ఉదుటున రథాన్ని లాగారు. ఆ వేగానికి రథం కొంతదూరం వెళ్లి సీసీ రోడ్డు పక్కన ఒకవైపు వంగింది. అప్పటికే రథంపై స్వామివారు, అమ్మవారు, అర్చకులు, చిన్నారులు ఉండడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన పోలీసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు.. రథాన్ని వెనక్కి లాగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దాదాపు గంటన్నరపాటు రథోత్స వం సాగింది. కాగా, భక్తులు భారీగా తరలిరావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొండపై తాగునీటి సమస్య ఇబ్బందులకు గురిచేసింది. జాతర ప్రాంగణంలో నీరు చల్లకపోవడంతో దుమ్ము, ధూళి భక్తుల్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, కేడీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, ఆలయ చైర్మన్ నేరెళ్ల సుమన్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.10లక్షల పరిహారం చెల్లించాలి



రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు, నాయకులు

- గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని నాయకుల ఆరోపణ
- రోడ్డెక్కిన మృతుడి బంధువులు, గ్రామస్తులు



అనిల్(ఫైల్)

ధర్మపురి: కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నాగారం గ్రామానికి చెందిన పసుల అనిల్(23) ప్రమాదానికి గురై మృతి చెందాడని ఆరోపిస్తూ ఆ గ్రామస్తులు, బంధువులు శుక్రవారం ధర్మపురి పట్టణంలో రాస్తారోకో చేశారు. పట్టణంలో ఉడ్ వర్కర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్న అనిల్.. రోజూమాదిరిగానే ఈనెల 5న రాత్రి పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలు దేరాడు. అయితే, ధర్మపురి – కమలాపూర్ మార్గంలో రైస్‌మిల్లు వద్ద రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ అక్కడి కల్వర్టుకు సమానంగా రోడ్డు నిర్మించాల్సి ఉండగా.. ఎత్తుగా నిర్మించాడు. అనిల్ అక్కడకు వెళ్లగానే బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు కరీంనగర్ తరలించారు. అక్కడి ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగానే అనిల్ మృతి చెందాడు. ఆగ్రహించిన బంధువులు, గ్రామస్తులు.. అనిల్ మృతదేహంతో ధర్మపురికి చేరుకున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగి అనిల్ మృతి చెందాడని, ఆ యువకుడి కుటుంబానికి రూ.10లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బాధిత కుటుంబానికి మద్దతుగా నిలిచారు. అనిల్‌కు భార్య అంజలి, కవల కూతుళ్లు ప్రసస్తా, ప్రవస్తా(7), కుమారుడు ఓంశ్రీ(15నెలలు) ఉన్నారు. చిన్నారులను చూసిన స్థానికులు కంటతడి పెట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు.. మృతదేహాన్ని నాగారం తరలించారు. అయితే, అక్కడకు వెళ్లిన గ్రామస్తులు శవాన్ని మళ్లీ ధర్మపురి తీసుకొచ్చి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతూనే ఉన్నారు. కాగా, కరీంనగర్‌లో ఉన్న కాంట్రాక్టర్‌తో నాయకులు మంతనాలు జరుపుతున్నారు.

సిజేరియన్లు వద్దు

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్

జగిత్యాల: జిల్లాలో 75 శాతం సిజేరియన్లు జరుగుతున్నాయని, వీటిని తగ్గించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సూచించారు. తన కార్యాలయంలో శుక్రవారం వైద్యులతో సమావేశమయ్యారు. సిజేరియన్లు చేస్తూ జిల్లా రెడ్‌జోన్ పరిధిలోకి వెళ్లిందన్నారు. సాధారణ ప్రసవాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేసుకునేలా చూడాలని చెప్పారు. ఇందులో ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు ముందు వరుసలో ఉండాలని కలెక్టర్ చెప్పారు. కొందరు ఏఎన్‌ఎంలు గర్భిణులను ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్తున్నట్లు తెలిసిందని, వారికి మెమోలు జారీచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీధర్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వైద్యులు

'డబుల్' ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

నూకపల్లిలో చేపట్టిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశించారు. నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని చెప్పారు. ఆమె వెంట అడిషనల్ కలెక్టర్లు మకరంద్, లత, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

కెపాసిటర్ల ఏర్పాటు అనివార్యం

సారంగాపూర్(జగిత్యాల): రైతులు తమ వ్యవసాయ పంపుసెట్లకు ఆటోమేటిక్ స్టార్టర్లను తగ్గించి, కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ హరీశ్ సూచించారు. కోనాపూర్, బీర్‌పూర్‌లో రైతులకు కెపాసిటర్ల ఏర్పాటు, ఆటోమేటిక్ స్టార్టర్ల వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. కెపాసిటర్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం తగ్గుతుందన్నారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని, మోటార్లు ఎక్కువ రోజులు మన్నికగా ఉంటాయని తెలిపారు. బీర్‌పూర్, సారంగాపూర్ ట్రాన్స్‌కో ఏఈలు శ్రీనివాస్, సతీశ్, లైన్‌మెన్లు తిరుపతి, సతీశ్ ఉన్నారు.

బియ్యం తూకంలో మోసాలకు చెక్

- రేషన్ డీలర్ వేలిముద్ర వేయాల్సిందే..
- అలాగైతేనే ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి కోటా విడుదల
- పారదర్శకత కోసమే అంటున్న అధికారులు
- ఈనెల 13వ తేదీ నుంచి అమలుకు చర్యలు

కథలాపూర్(వేములవాడ): రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా.. అర్హులైన లబ్ధిదారులకు అందించాలనే ఉద్దేశంతో ఇన్నాళ్లు బయోమెట్రిక్ విధానం ద్వారా బియ్యం పంపిణీ చేశారు. కానీ, ఎంఎల్‌ఎస్ గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యం తూకంలో వ్యత్యాసం రావడంతో డీలర్లు ఆ నష్టాన్ని భరించారు. ఇకనుంచి ఆ సమస్యకు పరిష్కారం లభించనుంది. డీలర్‌కు రావాల్సిన కోటాను తూకం వేశాక డీలర్ వేలిముద్ర వేస్తేనే బియ్యం గోదాము నుంచి బయటకు వస్తాయి. ఈమేరకు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. దీనిద్వారా రేషన్ డీలర్లతోపాటు కార్డుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 13వ తేదీ నుంచి ఈ ప్రక్రియ అమలు చేస్తామని సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు.

586 రేషన్ షాపులు.. 3.08 లక్షల కార్డులు..

- జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాల్లో కార్డుదారులకు సరుకులు పంపిణీ చేసేందుకు 586 రేషన్‌షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో 3.08 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి.
- ఇందులో ఆహార భద్రతకార్డులు 2,94,294 ఉండగా, అంత్యోదయ కార్డులు 14,316, అన్నపూర్ణ కార్డులు 146 ఉన్నాయి.
- లబ్ధిదారులు 8,88,679 మంది ఉన్నారు.
- ఈనెలలో ఒక్కో కార్డుపై 5 కిలోల చొప్పున సుమారు 4,768 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ దుకాణాలకు చేరుతున్నాయి.
- వీటిని లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తారు.
- జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, మల్యాల, ధర్మపురిలో సివిల్ సప్లయ్ శాఖ ఎంఎల్‌ఎస్ గోదాములు ఉన్నాయి.
- వీటినుంచి జిల్లాలోని 586 రేషన్‌షాపులకు ప్రతినెలా బియ్యం సరఫరా చేస్తారు.
- ఇకనుంచి రేషన్‌డీలర్లు గోదాములకు వెళ్లి వేలిముద్ర వేస్తేనే బియ్యం గోదాముల నుంచి బయటకు వస్తాయి.



బియ్యం పంపిణీ చేస్తున్న రేషన్ డీలర్(ఫైల్)

- గతంలో రేషన్ షాపులకు చేరే బియ్యం బస్తాలు 50 కిలోలు ఉండాల్సి ఉండగా.. రెండు – మూడు కిలోలు తక్కువగా వచ్చేవని పలువురు డీలర్లు వాపోయారు.
- బస్తాల్లో తక్కువ బియ్యం వచ్చాయని, ఈ విషయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమయ్యామని పేర్కొన్నారు.
- అయితే, ఈనెల 13 నుంచి డీలర్లకు బయోమెట్రిక్ విధానం అమలు చేస్తుండటంతో తూకంలో ఇకనుంచి ఏమాత్రం తేడా ఉండదని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా పంపిణీ చేయాలి



రేషన్‌షాపుల్లో ఇనాళ్లు కేంద్రప్రభుత్వం ఇచ్చే 5 కిలోలు, రాష్ట్రప్రభుత్వం ఇచ్చే 5 కిలోలు కలిపి మొత్తం 10 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేశారు. ఇప్పుడు కేంద్రప్రభుత్వం ఇచ్చే 5 కిలోల బియ్యమే పంపిణీ చేయడం దారుణం. రాష్ట్రప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించవద్దు. గతంలో మాదిరిగా 10 కిలోల బియ్యం ఉచితంగా ఇవ్వాలి. రాయితీపై చక్కెర, కిరోసిన్ పంపిణీ చేయాలి.

– పల్లె గంగాధర్, భూషణరావుపేట, కథలాపూర్

పారదర్శకత కోసమే..



ఈనెల 13నుంచి రేషన్ దుకాణాల ద్వారా ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గోదాములో బియ్యం తూకంలో తేడా ఉండ వద్దని డీలర్లకు బయోమెట్రిక్ విధానం అమలు చేస్తున్నాం. ఇందుకోసం రేషన్ డీలర్లు తమకు కేటాయించిన కోటా మొత్తం తూకం వేయించుకోవాలి. అనంతరం ఈ–పాస్ యంత్రంపై వేలిముద్ర వేస్తే గోదాము నుంచి రేషన్ షాపులకు బియ్యం బస్తాలు చేరవేరుస్తారు. పారదర్శకత కోసం ఈ విధానం అమలు చేస్తున్నాం.

– చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి

క్లుప్తంగా

శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: హబ్సీపూర్ గ్రామంలో ఇటీవల నిర్మించిన శివాలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సతీమణి రాధిక, జెడ్పీ సీఈవో రామానుజం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కల్లెడ సింగిల్‌విండో చైర్మన్ సందీప్‌రావు, సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఎల్లారెడ్డి, కౌన్సిలర్ ముస్కు నారాయణరెడ్డి, నాయకులు బాలముకుందం, మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నృసింహుని బ్రహ్మోత్సవాలపై సమీక్ష



చర్చిస్తున్న అధికారులు, పాలకులు

ధర్మపురి: త్వరలో నిర్వహించే ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలపై మున్సిపల్ అధికారులు, పాలకవర్గం సమీక్షించింది. శుక్రవారం కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షత వహించారు. జాతరలో చేపట్టే 18 అంశాలు, పనులు, ఏర్పాట్లకు ఆమోదం తెలిపారు. డివైడర్ల మధ్య మొక్కలు నాటడం, పైపులైన్ల లీకేజీ సామగ్రి కొనుగోలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, స్టేషనరీ సమకూర్చుకోవడం తదితర అంశాలను ఆమోదించారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ రామన్న, మున్సిపల్ కమిషనర్ రమేశ్, మేనేజర్ గంగాధర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోతాదు మించితే ముప్పే..!

- తప్పనిసరైతేనే పురుగుమందు చల్లాలి
- శాస్త్రవేత్తల సూచనలు



వరి పైరుపై పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

జగిత్యాలఅగ్రికల్చర్: ఓ వైపు వ్యవసాయ శాస్త్రవేత్తలు అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలు రూపొందిస్తున్నారు. మరోవైపు చీడపీడల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు ఇష్టానుసారంగా పురుగుమందు పిచికారీ చేస్తున్నారు. ఇలా అవసరం లేకున్నా పురుగు మందులు వాడడం ద్వారా దాదాపు 20–25 శాతం వరకు పంటకు నష్టం వాటిల్లుతోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత యాసంగిలో వరికి కాండం తొలుచు పురుగు ఆశించింది. దీని నివారణకు ఒకటికి రెండుసార్లు పురుగుమందు చల్లుతున్నారు. అంతేకాదు.. మందు చల్లే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించకపోవడంతో జిల్లాలో ఏటా ఐదారుగురు రైతులు మృతి చెందుతున్నారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

అవగాహన లేకనే..

- పురుగుమందుల వాడకంపై రైతులకు అవగాహన లేదు.
- గ్రామాల్లోని వ్యాపారులు సూచించిన పురుగుమందులనే రైతులు పంటపై పిచికారీ చేస్తున్నారు.
- ఒక్కో కంపెనీ మందు ప్రభావం ఒక్కోతీరుగా ఉంటుంది. పిచికారీ చేసే వ్యక్తిపై తీవ్ర ప్రభావం చూపుతుంది.
- కొన్ని రసాయనాలు ఘాటైన వాసన కలిగి ఉంటే, మరికొన్ని తేలికగా ఉంటాయి.
- రైతులు ఇవేమీ పట్టించుకోవడంలేదు. తమకు ఇష్టం వచ్చిన మందులు వాడుతూ ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు.

పెడచెవిన పెడుతూ..

చాలామంది రైతులు పిచికారీ చేసే సమయంలో బీడీలు, సిగిరెట్లు తాగడం, పాన్‌పరాగ్, గుట్కా నమలడం, తంబాకు నోట్లో వేసుకోవడం చేస్తుంటారు. మధ్యాహ్న భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడంలేదు. నీళ్లతోనే పైపైన శుభ్రం చేసి భోజనం తింటున్నారు. దీంతో మందు ప్రభావం రైతు, కూలీ శరీరంలోకి ప్రవేశిస్తోంది. నాడీ, శ్వాస వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గాలి వీచే దిశ తెలియకుండా మందు చల్లుతున్నారు. దీనిద్వారా మందు గాలిలో కలిసి శ్వాస తీసుకుంటున్నప్పుడు ముక్కు ద్వారా శరీరంలోకి వెళ్తోంది. దీంతో వాంతులు, తల తిప్పడం, శరీరమంతా చెమటలు పట్టడం, సరైన శ్వాస అందకపోవడం వంటివి జరుగుతున్నాయి.

జాగ్రత్తలను విస్మరించొద్దు..

- పురుగుమందు పిచికారీ చేసేసమయంలో రైతులు, కూలీలు చేతులకు గ్లౌజ్‌లు వేసుకోవాలి.
- స్ప్రేయర్లకు లీకేజీలు లేకుండా చూసుకోవాలి.
- రసాయన మందు నీళ్ల శరీరంపై పడకుండా లూజు దుస్తులు, కళ్లద్దాలు ధరించాలి.
- పిచికారీ పూర్తయ్యాక తల పైనుంచి నుంచి సబ్బుతో స్నానం చేయాలి.
- గాయాలు ఉంటే కనిపించకుండా ప్లాస్టర్ వేసుకోవాలి.
- పిచికారీ చేసే సమయంలో అనారోగ్యం బారినపడితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- మందు ప్రభావం గుర్తించేందుకు మందు డబ్బాను వైద్యుడికి చూపించాలి.

ఎప్పుడు వాడాలంటే..

పొలాల్లో పురుగు కనిపించిన వెంటనే మందు పిచికారీ చేయడం చాలామంది రైతులకు అలవాటుగా మారింది. ఇది రైతులకు శ్రమతోపాటు ఆర్థికంగా నష్టం చేకూర్చుతోంది. తొలుత పంటను రెండు, మూడురోజులకోసారి పరిశీలించాలి. పంటకు ఏ పురుగుతో, ఎలాంటి నష్టం జరుగుతుందనే విషయంపై అవగాహనకు రావాలి. ఆ తర్వాత పురుగు మందు చల్లాలి. అవసరమైతే వ్యవసాయాధికారి, శాస్త్రవేత్తల సిఫారసు మేరకు రసాయన మందు పిచికారీ చేయాలి.

ఖర్చు పెరుగుతోంది



పురుగుమందులు ఎందుకు వాడుతున్నారో చాలామంది రైతులకు తెలియడం లేదు. దీనిద్వారా ఖర్చు పెరుగుతోంది. పురుగులు చావడం లేదు. ఏదైనా సమస్య తలెత్తితే శాస్త్రవేత్తలు, లేదా వ్యవసాయాధికారుల సూచనల మేరకు నాణ్యమైన సంస్థల పురుగుమందులు పిచికారీ చేయాలి.

– శ్రీనివాస్,పరిశోధన స్థానం డైరెక్టర్, పొలాస

జాగ్రత్తలు తీసుకోవాలి



పంటపై పురుగు మందులు చల్లే సమయంలో రైతులు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. మందు గాలిలో కలుస్తూ, శ్వాస తీసుకున్నప్పుడు శరీరంలోకి ప్రవేశిస్తుంది. కరోనా సమయంలో వాడిన మాస్క్‌నైనా వాడాలి. పని పూర్తయ్యాక తల స్నానం చేసిన తర్వాతే ఆహారం తీసుకోవాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, వైద్య నిపుణుడు, జగిత్యాల

రూ.25లక్షల పరిహారం ప్రకటించండి

- ఎంపీ అర్వింద్



గంగాధర్ కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎంపీ అర్వింద్

జగిత్యాలరూరల్: నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతు గడ్డం జలపతిరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం ప్రకటించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ డిమాండ్ చేశారు. ఇటీవల తన ఇద్దరు కూతుళ్లతో కలిసి ఆత్మహత్య చేసుకున్న జలపతిరెడ్డి కుటుంబాన్ని ఆయన శుక్రవారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జలపతిరెడ్డి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయస్థానం నుంచి భూ పరిహారం ఇప్పించేందుకు బీజేపీ న్యాయ సాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి, వరుణ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అంతర్గాం గ్రామానికి చెందిన బీజేపీ బూత్ కమిటీ ఉపాధ్యక్షుడు బొంతల గంగాధర్ కుటుంబ సభ్యులకు అర్వింద్ రూ.లక్ష సాయం అందజేశారు.

జాతీయ పోటీలకు ఎంపిక

పెద్దపల్లిరూరల్: గాయత్రీ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థి బాలసాని శ్రీకాంత్ గోవాలో నిర్వహించే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 11,12 తేదీల్లో గోవాలోని మాడ్‌గోన్ ప్రాంతంలో జరిగే ఆల్‌ఇండియా స్పోర్ట్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీకాంత్ పాల్గొంటాడు.

అప్పు చెల్లించలేదని రైతు భూమి వేలం



భూమిని వేలం వేస్తున్న బ్యాంకు అధికారులు

కాల్వశ్రీరాంపూర్: అప్పు తీర్చలేదని రైతుభూమిని కేడీసీసీబీ అధికారులు వేలం వేసిన ఘటన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారంలో శుక్రవారం చోటుచేసుకుంది. దూలం సదానందం 2016లో తనకున్న ఎనిమిది ఎకరాలను కాల్వశ్రీరాంపూర్ కేడీసీసీబీలో తాకట్టుపెట్టి రూ. 12లక్షల అప్పు తీసుకున్నాడు. కొంతకాలానికి రూ. 7,17,027 చెల్లించాడు. మరో రూ.8,37,027 చెల్లించాల్సి ఉండగా.. వాయిదాల ప్రకారం చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు నోటీసులు పంపించారు. స్పందన లేకపోవడంతో గ్రామపంచాయతీ ఆవరణలో ఓపెన్ టెండర్ నిర్వహించారు. వేలంలో 31మంది రైతులు పాల్గొన్నారు. 10 పదిమంది రైతులు వేలంలో పాటపాడారు. సమీప జాఫర్‌ఖాన్‌పేటకు చెందిన నారిగే వినోద్‌కుమార్‌రూ.13,5,000కు ఎకరం దక్కించుకున్నట్లు కేడీసీసీబీ అసిస్టెంట్ రిజిస్టర్ వంశీకృష్ణ తెలిపారు. బ్యాంకు మేనేజర్ కరుణశ్రీ, ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్, సర్పంచ్ విజయ ఉన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే..



మాట్లాడుతున్న హరి అశోక్

కోరుట్ల: తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత వారి పిల్లలదే అని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. డివిజన్‌లోని ఆల్ సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కౌన్సెలింగ్ కేంద్రంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కోరుట్ల, మెటుపల్లి డివిజన్ల ప్రతినిధులు హాజరయ్యారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులను వేధిస్తే వయోవృద్ధుల చట్టంలోని సెక్షన్- 24 ప్రకారం జైలు శిక్ష విధిస్తారని అన్నారు. నాయకులు హన్మంతరెడ్డి, పబ్బా శివానందం, గంటిడి రాజ్‌మోహన్, నల్ల లక్ష్మీనారాయణ, ఒజ్జల బుచ్చిరెడ్డి, సొడాల కమలాకర్ పాల్గొన్నారు.

రుణ వాయిదాలు సకాలంలో చెల్లించాలి



చెక్కులు అందిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: వ్యవసాయ పనుల కోసం రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం వివిధ మండలాలకు చెందిన రైతులకు సుమారు రూ.13.60 లక్షల విలువైన రుణాల చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. వ్యవసాయ పనుల కోసం తక్కువ వడ్డీతో రైతులకు రుణాలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు షేర్ల రాజేశం, డైరెక్టర్లు ఎల్లాగౌడ్, పెద్దపోశం, నూర లక్ష్మి, బుగ్గారం సర్పంచ్ మూల వసంత, సీఈవో రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేయొద్దు



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్ హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను దుర్భాషలాడిన హమారా ప్రసాద్‌పై స్థానిక ఠాణాలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మహేశ్ మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. నాయకులు ఎల్కా కమలాకర్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, మగ్గిడి సంతోష్, అరిగడ్డి పెద్దులు, జంగం దినేశ్, కోరుట్ల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జలపతిరెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ అండ

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- మృతుడి కుటుంబానికి రూ.లక్ష సాయం



సాయం అందిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతు జలపతిరెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. తన ఇద్దరు కూతుళ్లను బావిలో తోసేసి, తాను ఆత్మహత్య చేసుకున్న గడ్డం జలపతిరెడ్డి కుటుంబానికి శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో రూ.లక్ష సాయం చేశారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. జలపతిరెడ్డి చిన్ననాటి నుంచి కష్టపడి కుటుంబాన్ని పోషించాడని, ప్రభుత్వం టీఆర్‌నగర్ గ్రామానికి అవసరమైన భూని ఆయన నుంచి సేకరించిందని అన్నారు. ఉన్న భూమి కోల్పోయి ఉపాధి లేక ప్రభుత్వం పరిహారం అందించక, న్యాయవాది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో జలపతిరెడ్డి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, నాయకులు తాటిపర్తి దేవేందర్ రెడ్డి, రమేశ్‌బాబు, తాటిపర్తి రాంచంద్రారెడ్డి, రాధాకిషన్ పాల్గొన్నారు.

మృతిపై విచారణ జరపాలి

జగిత్యాలటౌన్: రైతు జలపతిరెడ్డి ఆత్మహత్య ఘటన రాష్ట్రాన్ని కుదిపేస్తున్నా.. అందుకు కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవడానికి పోలీసులు ఎందుకు వెనుకంజ వేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. జలపతిరెడ్డి మృతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు సూసైడ్ నోట్‌ను మరణ వాంగ్మూలంగా స్వీకరించాలనానరు. నిందితుడు పోలీసుస్టేషన్ ముందే తిరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు కొత్త మోహన్, గిరి నాగభూషణం, బండ శంకర్, గాజంగి నందయ్య, చందా రాధాకిషన్, జున్ను రాజేందర్ తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలి



కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

- పెండింగ్ కేసులలో పురోగతి సాధించాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్

చందుర్తి(వేములవాడ): శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని గదులతోపాటు పరిసర ప్రాంతాలను, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులలో పురోగతి సాధించాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సమాచార వ్యవస్థను మెరుగుపర్చుకోవాలన్నారు. గ్రామాల్లో ఏమి జరుగుతుందో ఎప్పటికప్పుడు సేకరించేందుకు వీపీవోలను అప్రమత్తంగా ఉంచాలన్నారు. ప్రజలతో సంబంధాలను పెంచుకోవాలని సిబ్బందికి సూచించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, కోనరావుపేట ఎస్సై రమాకాంత్ ఉన్నారు.

ఈ కలపకు అనుమతులు ఉన్నాయా..?



నూకలమర్రి గ్రామంలో నరికివేసిన చెట్లు

వేములవాడరూరల్: గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది వ్యాపారులు చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వేములవాడ మండలంలోని నూకలమర్రి తదితర గ్రామాల్లో రైతుల చెట్లను కొనుగోలు చేసి ఫారెస్టు అధికారులకు తెలియకుండానే చెట్లను నరికేస్తూ సిద్దిపేట, కామారెడ్డి ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గ్రామాల్లో పలువురు ఆరోపిస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం ఎలాంటి అనుమతి లేకుండా చెట్లను తొలగించొద్దని నిబంధనలు ఉన్నప్పటికీ కొంతమంది వ్యాపారులు ఈ ప్రాంతంలో చెట్లను నరికేస్తూ రాత్రి సమయంలో దుంగలను తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రైతుల పేరుపై ఈ కలపను ఇతర ప్రాంతాలకు సద రు కాంట్రాక్టర్లు తరలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో తనిఖీలు చేపట్టి సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తు లు కోరుతున్నారు. ఈ విషయంపై ఎఫ్ఆర్‌వోను వి వరణ కోరగా కొంతమంది వ్యాపారులు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకుని చెట్లను నరికేస్తున్నారని నూకలమర్రిలో ఎలాంటి అనుమతులు లేకుండా చె ట్లను నరికేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామ ని తెలిపారు.

మద్యానికి బానిసై బాలుడి మృతి



లవన్ కుమార్ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): చిన్నతనంలోనే మద్యానికి బానిసైన మైనర్ బాలుడు అర్ధంతరంగా తనువు చాలించిన ఘటన తంగళ్లపల్లి మండలం కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్‌రూం సముదాయంలో శుక్రవారం విషాదం నింపింది. తంగళ్లపల్లి పోలీసులు, బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండలంలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో నివసించే వేముల కవిత భర్త సదానందం నాలుగేళ్ల క్రితం అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. కవితకు ఒక కొడుకు లవన్‌కుమార్(16), కూతురు ఉన్నారు. లవన్‌కుమార్ సిరిసిల్లలోని గీతానగర్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. గత ఆరు నెలలుగా మద్యానికి బానిసైన లవన్‌కుమార్‌ను తల్లి కవిత మందలించినప్పటికీ తీరుమార్చుకోలేదు. మద్యం తాగుతూ చెడు అలవాట్లకు బానిసై ఆర్యోగ్యాన్ని పాడుచేసుకున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి అరగంట తరువాత తిరిగొచ్చి వాంతులు చేసుకుంటూ స్పృహ కోల్పోయాడు. వెంటనే సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశాడు. తన కొడుకు తాగుడుకు, చెడు అలవాట్లకు బానిసై ఆరోగ్యం పాడుచేసుకుని చనిపోయాడని తల్లి కవిత ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువరైతు ఆత్మహత్య



రాజు(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన రైతు బట్టు రాజు(30) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు వివరాలు. గూడెం గ్రామానికి చెందిన రాజు తనకున్న ఎకరం వ్యవసాయ భూమిలో వరి సాగుచేస్తున్నాడు. కుటుంబ పోషణకు అప్పులు చేసిన రాజు.. వాటిని చెల్లించేందుకు ఇబ్బందులు పడ్డాడు. రూ.5లక్షల వరకు అప్పులు ఉండగా, ఇటీవల పది గుంటల భూమిని సైతం విక్రయించాడు. అయిన అప్పులు తీరకపోవడంతో.. తీవ్ర మనస్తాపానానికి గురై పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వెంకటేశ్వర్లు ఘటన స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య రమ్య, కుమార్తె మనోజ్ఞ, కుమారుడు యశ్వంత్ ఉన్నారు. బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బైక్ దొంగకు ఆరునెలల జైలు

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని ఓ ఫర్టిలైజర్ దుకాణం ఎదుట నిలిపిన బైక్‌ను దొంగలించిన వ్యక్తికి ఆరు నెలల కఠిన కారాగార జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి సౌజన్య తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాలు. గతేడాది సెప్టెంబర్ 5న కుమ్మం ప్రశాంత్ తన అవసరాల నిమిత్తం సిరిసిల్లకు వచ్చిన తన బైక్‌ను వినాయక ఫర్టిలైజర్ షాప్ ముందు పార్కింగ్ చేశాడు. పని ముగించుకుని వచ్చి చూసేసరికి బైక్‌లేదు. తన బైక్ పోయిందని బాధితుడు సిరిసిల్లటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు తెలుసుకుని బైక్ దొంగతనం చేసింది ఇల్లంతకుంట మండలం దురుముట్ల నరేశ్‌గా గుర్తించి కేసు నమోదు చేశారు. సాక్ష్యాలను కోర్టులో నిరూపించడంతో నరేశ్‌కు ఆరు నెలల కఠిన కారాగార శిక్ష వేయడంతోపాటు రూ.100 జరిమానా విధిస్తూ శుక్రవారం న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం



యువకుడిని నిలదీస్తున్న స్థానికులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్‌లో శుక్రవారం ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. మద్యం మత్తులో ఉన్న ఆ యువకుడు ఇంట్లో ఎవరూలేని సమయంలో ఓ ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి ప్రయత్నించాడు. అలాగే అడ్డుకోబోయిన స్థానికులపై రెచ్చిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని మద్యం మత్తులో ఉన్న యువకున్ని అదుపులోకి తీసుకున్నారు. అయితే, నిందితుడు వారికి పొంతనలేని సమాధానాలు చెప్పాడు.

వార్డు సభ్యుడి ఆత్మహత్యాయత్నం

పెద్దపల్లిరూరల్: మండలంలోని నిట్టూరు పంచాయతీ వార్డుసభ్యుడు బండ హన్మంతరావు (32) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. అవివాహితుడైన హన్మంతరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తండ్రి నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు.

డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి

శంకరపట్నం: మండలంలోని చింతలపల్లిలో డ్రెయినేజీలో పడి బొంతులు శ్రీనివాస్(40) వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. చింతలపల్లికి చెందిన శ్రీనివాస్ వ్యవసాయంతోపాటు ఆటో నడుపుతుంటాడు. గురువారం అర్ధరాత్రి ఇంటినుంచి బైక్‌పై వెళ్లిన శ్రీనివాస్ గ్రామంలోని డ్రెయినేజీలో పడి మృతిచెందిన విషయం శుక్రవారం వెలుగుచూసింది. మృతుడి భార్య రజిత ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.